ఈనాడు
పల్నాడు
గురువారం సెప్టెంబరు 26, 2024

హానికారం

మిర్చి తొడిమలు..
తుక్కు కాయలు.. తాలుకాయలు..
వర్షానికి తడిసి రంగు మారి..
చీడపీడలతో దెబ్బతిన్న మిరపకాయలు..
వీటన్నింటినీ పొడిగా చేసి..
రంగులు జోడించి... సంచుల్లో నింపి...
మార్కెట్‌లోకి తెస్తున్నారు...
ఇదే గుంటూరు కేంద్రంగా తయారయ్యే
కల్తీ కారం ..

- నాసిరకం మిరపతో తయారీ
- రసాయనాలతో కృత్రిమ రంగుల వాడకం

ఈనాడు, అమరావతి

మెరిసేదంతా బంగారం కాదన్నట్టు... ఎర్రగా ఉన్నంత మాత్రాన అది అసలైన కారమే కాదు. ఆసియాలోనే పెద్దదైన గుంటూరు మిర్చియార్డు పరిసర ప్రాంతాల్లోని కొన్ని మిల్లుల్లో హానికర రసాయనాలు, రంగులతో తయారవుతోంది కల్తీ కారం. రకరకాల పేర్లతో రోజువారీ గిరాకీ ఉండే అల్పాహారశాలలు, మాంసాహార దుకాణాలు, హోటళ్లు, క్యాటరింగ్ పనులు చేసే కొంతమందికి అతి తక్కువ ధరకే అంటగడుతున్నారు. గుంటూరు కారానికి ఉన్న డిమాండ్‌ను ఉపయోగించుకుని ఈ అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.





గుంటూరులో తయారీ వివరాలు లేకుండా విక్రయిస్తున్న నాసిరకం కారం

తయారీ ఖర్చు కంటే తక్కువకే....

పది కిలోల కారం కావాలంటే 12.50 కిలోల మిర్చిని మర పట్టించాలి. సగటున కిలో మిరపకాయల ధర రూ. 170 అనుకుంటే.. తొడిమలు, ఇతరత్రా వ్యర్థాలు పోగా కిలో కారం తయారీకి రూ. 220 వరకు ఖర్చవుతుంది. ప్యాకింగ్, రవాణా ఇతర ఖర్చులు, లాభం కలిపి కనీసం మరో రూ. 30 వేసుకున్నా.. కిలో రూ. 250కి పైగానే విక్రయించాలి. ప్రముఖ కంపెనీల కారం పొడి ధరలు మార్కెట్లో రూ. 270 నుంచి రూ. 400 వరకు ఉన్నాయి. కానీ.. స్థానికంగా కొంతమంది వ్యాపారులు కిలో కారం రూ. 150 నుంచి రూ. 200కే విక్రయిస్తున్నారు. అదే 25 కిలోల కారం బస్తా కొనుగోలు చేస్తే ఇంకా తక్కువకే వస్తోంది. ఎక్కువగా లూజుగానే విక్రయిస్తున్నారు.

నాసిరకం మిర్చితో....

యంత్రాలతో మిరపకాయల తొడిమి తీస్తుంటారు. ఈ క్రమంలో తొడిమలు, మిర్చి తుక్కు, విత్తనాలతో కలిపి వృథా వస్తుంది. శీతల గోదాములు, మిర్చియార్డులో బస్తాలు అటూఇటూ మార్చే క్రమంలో కొన్ని కాయలు కిందపడి నలిగి తుక్కుగా మారిపోతుంటాయి. వీటిని కిలో రూ. 20 నుంచి రూ. 22 పెట్టి కొనుగోలు చేస్తుంటారు. వీటితో కారం తయారు చేసి రంగులు, రసాయనాలు, పొద్దు తిరుగుడు, పామాయిల్ వంటివి కలిపి ఎర్రగా ఉండేలా చూస్తున్నారు. ఈ యూనిట్లు తక్కు నుంచి విత్తనాలు వేరే చేసే పేరుతో నడుస్తున్నాయి. దీంతో ఎవరికీ అనుమానం రావడం లేదు.

ఎంపిక చేసుకున్నవారికే....

కల్తీ కారాన్ని మార్కెట్లో ఎంపిక చేసుకున్నవారికే బస్తాల్లో వేర్వేరు బ్రాండ్ల పేరుతో విక్రయిస్తున్నారు. తక్కువ ధరకే వస్తుండడం.. అదీ స్థానికంగానే లభిస్తుండడంతో వ్యాపారులు సైతం ఈ కల్తీ కారాన్ని కొంటున్నారు. వీరు అర కిలో, కిలో, ఐదు కిలోలుగా ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి విడిగా విక్రయిస్తున్నారు. గుంటూరు నగరంలోని ఏలూరు బజారు, పట్నం బజారు, మహాత్మాగాంధీ రోడ్డు, ఏటుకూరు రోడ్డు ప్రాంతాల్లో చిన్నచిన్న దుకాణాలకు రవాణా అవుతోంది. ఎక్కువగా పట్నంబజారు కేంద్రంగానే ఈ వ్యాపారం నడుస్తోంది. కొంతమంది వ్యాపారులైతే రహస్య అరల్లో దాచి మరీ విక్రయిస్తున్నారు. రోజువారీ వినియోగం ఎక్కువగా ఉన్నవారు అడిగి మరీ ఈ నాసిరకాన్ని కొంటున్నారని ఓ వ్యాపారి చెప్పడం గమనార్హం.

జీర్ణవ్యవస్థపై తీవ్ర ప్రభావం

కృత్రిమ రంగులు, రసాయనాలతో కల్తీ అయిన కారంతో చేసిన ఆహారం తీసుకుంటే జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఈ రసాయనాలు చాలా ప్రమాదకరం. దీర్ఘకాలంలో అల్సర్లతోపాటు కాలేయం దెబ్బతినే ప్రమాదం ఉంది. అన్నవాహిక, జీర్ణాశయంలో పూతలు వచ్చి పుండ్లు పడొచ్చు. కొన్నాళ్లపాటు కల్తీకారం వాడితే క్యాన్సర్‌కూ దారి తీయొచ్చు. చర్మవ్యాధులు వస్తాయి. నరాల వ్యవస్థపైనా ప్రభావం పడుతుంది.

- డాక్టర్ సుధీర్‌బాబు, ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్ గుంటూరు

సాగర్‌కు 46802 క్యూసెక్కుల నీరు చేరిక

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 46,802 క్యూసెక్కుల నీరు వస్తోంది. సాగర్ కుడి కాలువకు 10,120, ఎడమ కాలువకు 5018, సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 28,664, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2400, లోలెవల్ కెనాల్‌కు 600 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జలాశయ నీటిమట్టం 589.10 అడుగుల గరిష్ఠ స్థాయికి చేరువలో ఉంది.

కాన్పు కష్టాలు

- ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసూతి వైద్యుల కొరత
- అత్యవసర చికిత్స అందక గర్భిణులు విలవిల



ఈనాడు డిజిటల్, నరసరావుపేట

నవ మాసాలు మోసిన తరువాత బిడ్డను కని ఆనందించాల్సిన గర్భిణులను కష్టాలు వెంటాడుతున్నాయి. ఓవైపు పురిటి నొప్పులతో సతమతమవడంతో పాటు వైద్య చికిత్స అందక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విలవిలాడుతున్నారు. ప్రధానంగా జిల్లాలో పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు లేకపోవడంతో పాట్లు పడుతున్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మాచర్ల నియోజకవర్గంలో విజయపురిసౌత్, ఈపూరు, పెదకూరపాడు, అమరావతి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో గైనకాలజిస్టులు లేరు. పెదకూరపాడులో పని చేసే వైద్యురాలు మాధవీలత డిప్యుటేషన్‌పై సంవత్సరకాలంగా నరసరావుపేటలో పని చేస్తున్నారు. ఈపూరులో పని చేసే వైద్యురాలు మార్చిలో బదిలీ అయ్యారు. ఇక్కడకు మంగళవారం, శుక్రవారం వినుకొండ నుంచి డిప్యుటేషన్‌పై వస్తూ పోతున్నారు. అమరావతిలో అయితే రెండు సంవత్సరాలుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. మరోపక్క చాలామందిని ప్రసవం కోసం నరసరావుపేట ఆసుపత్రికే సిఫారసు చేయడంతో రద్దీ పెరిగి బెడ్ల కొరత వేధిస్తోంది. ఆస్పత్రిపై ఒత్తిడి పెరుగుతోంది. అటు గర్భిణులకు కూడా దూరాభారం అవుతోంది.

★ విజయపురిసౌత్‌కు చెందిన కమ్లీబాయికి ఎనిమిదో నెల. వారం వారం ఆస్పత్రిలో చూపించుకునేందుకు మాచర్లకు వస్తోంది. ఆర్టీసీ బస్సులో కుదుపుల ప్రయాణంలో ఇబ్బందులున్నా రావక తప్పడం లేదు. విజయపురిసౌత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గైనకాలజిస్టు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం. దూర ప్రయాణమైనా వేరే దారి లేక మాచర్ల వస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

★ పెదకూరపాడు, అమరావతి మండలాల గర్భిణులంతా అటు గుంటూరు కానీ, ఇటు సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. రెండుచోట్ల కూడా గైనకాలజిస్టులు లేరు. పెదకూరపాడులో సంవత్సరం నుంచి ఖాళీగా కుర్చీ ఉన్నా ఇంత వరకూ ఎవరినీ నియమించలేదు. గైనకాలజిస్టులు లేకపోవడంతో కొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించుకుంటూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

★ ఈపూరు మండలంలో చుట్టుపక్కల గ్రామస్థులకు మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌నే దిక్కు. ఇక్కడా గైనకాలజిస్టు లేరు. దీంతో గర్భిణులంతా వినుకొండ కానీ, నరసరావుపేట కానీ వస్తున్నారు. జిల్లా కేంద్రానికి వస్తే జనం రద్దీ విపరీతంగా ఉంటోందని, రోజంతా ఇక్కడే గడిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పురుడు పోసేది స్టాఫ్ నర్సులే..

ఆస్పత్రులకు వచ్చే గర్భిణులకు హెడ్ నర్సులే దిక్కవుతున్నారు. వారే కాన్పులు చేస్తున్నారు. చేతనైనంత మేరకు చికిత్స అందించి పెద్దాసుపత్రాలకు పంపిస్తున్నారు. అమరావతిలో అయితే సాధారణ ప్రసవాలను హెడ్ నర్సులు చేస్తున్నారు. సిజేరియన్ అయ్యే అవకాశం ఉందనుకుంటే గుంటూరుకు పంపిస్తున్నారు. పెదకూరపాడులోనూ ఇదే పరిస్థితి. పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అసలు ప్రసవాలే జరగకపోగా, మరికొన్నిచోట్ల నామ్‌కే వాస్తేగా చూస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మాతాశిశు సంరక్షణ కార్యాక్రమాలను విస్తృతం చేయడానికి ఈ వైద్య కేంద్రాలు కీలకం. ప్రతి సీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షించడానికి స్కానింగ్ యంత్రాలు ఏర్పాటు చేశారు. శస్త్రచికిత్స గదులు నిర్మించారు. అవసరమైన వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉంచారు. కానీ మత్తు వైద్య, ప్రసూతి వైద్య నిపుణుల కొరత వేధిస్తోంది. సాధారణం తప్ప ఏ మాత్రం సిజేరియన్లు అవసరమైనా గుంటూరు జీజీహెచ్‌కు లేదా ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్ణీత లక్ష్యం మేరకు కూడా ప్రసవాలు జరగడం లేదు. ప్రతి పీహెచ్‌సీలో కనీసం ఏడాదికి 10 ప్రసవాలు జరిగేలా చూడాలని, ప్రజలకు సేవలపై నమ్మకం కలిగించాలని పలుమార్లు ఉన్నతాధికారులు సమావేశాల్లో తెలియచేశారు. అయినా మార్పు రావడం లేదు. కొందరు సున్నా లేకుండా ఒక్క ప్రసవం చేసినట్లు లెక్కలు చూపుతున్నారు.

ఆర్ సెట్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం ఆర్ సెట్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్‌సీసీ, విభిన్న ప్రతిభావంతులు, క్రీడా కోటాలో సీట్లు దక్కించుకున్న అభ్యర్థుల విద్యార్హత పత్రాలు పరిశీలించామని కన్వీనర్ డాక్టర్ బ్రహ్మాజీరావు చెప్పారు. ఏపీ ఆర్ సెట్ ప్రవేశాల కన్వీనర్ వెంకటేశ్వరరావు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. మొత్తం 105 మంది అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలను పరిశీలన చేయించుకున్నారు. క్రీడల కోటాలో సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో కొంత గందరగోళం నెలకొన్నట్లు అభ్యర్థులు తెలిపారు. సర్టిఫికెట్లకు కాలపరిమితి ఉందని అధికారులు చెప్పడంతో అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు అన్ని సర్టిఫికెట్లు తనిఖీ చేసి, ఆ వివరాలు ప్రభుత్వానికి పంపిస్తామని.. అక్కడ తీసుకునే నిర్ణయం ఆధారంగా సీట్లు కేటాయిస్తామని చెప్పడంతో అభ్యర్థులు శాంతించారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించారు.

రైతుల అభిప్రాయం మేరకు భూ సేకరణ : జేసీ



రైతులతో మాట్లాడుతున్న సంయుక్త పాలనాధికారి సూరజ్ ధనుంజయ్

నాదెండ్ల, న్యూస్‌టుడే : ప్రజల అవసరాలకు రైతుల అనుమతితోనే భూ సేకరణ చేస్తున్నామని, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా సంయుక్త పాలనాధికారి సూరజ్ ధనుంజయ్ సూచించారు. నాదెండ్ల తహసీల్దారు కార్యాలయంలో నార్కట్‌పల్లి- వాడరేవు (167ఏ) జాతీయ రహదారి విస్తరణకు భూ సేకరణ (అవార్డు)పై రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గణపవరం, ఇర్లపాడు, కనపర్రు రైతులతో ఆయన మాట్లాడి.. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం సేకరిస్తున్న భూ విస్తీర్ణం, భూ యజమానులకు ఇవ్వనున్న పరిహారం తదితర వివరాలు తెలియజేశారు. సమావేశంలో ఆర్డీవో సరోజిని, తహసీల్దారు వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

27న గ్రహణం మొర్రి స్క్రీనింగ్ శిబిరం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్స్, బసవ తారకం స్మైల్ ట్రైన్ సెంటర్, సమగ్ర శిక్షల సంయుక్త ఆధ్వర్యంలో 27న గ్రహణం మొర్రి స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు, సహాయ ఐఈడీ సమన్వయకర్త సెల్వరాజ్‌లు తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాల శంకర భారతీపురంలో ఉదయం 10 నుంచి శిబిరం ఉంటుందని, 6 నెలల నుంచి 50 ఏళ్లలోపు వారు హాజరు కావచ్చని వివరించారు.

అబ్కారీ శాఖ జిల్లా అధికారిగా మణికంఠ

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జిల్లా అధికారి (ఈఎస్) ఖాజా మోహిద్దీన్‌ను ఉన్నతాధికారులు ఒంగోలు బదిలీ చేశారు. నంద్యాల ఎక్సైజ్ ఈఎస్ కె.మణికంఠను అబ్కారీ శాఖ జిల్లా అధికారిగా నియమించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో విధులు నిర్వహిస్తున్న జి.నాగేశ్వరరావును ఏపీఎస్‌బీసీఎల్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.

పల్నాట మాగాణికే మొగ్గు

- ఈ ఏడాది భారీగా పెరిగిన వరి సాగు
- సాగర్ నీటి విడుదలే కారణం

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

వరి సాధారణ సాగు విస్తీర్ణం: 42,000 హెక్టార్లు
గతేడాది సాగు కేవలం 10,500 హెక్టార్లే
ప్రస్తుతం: 50,000కుపైగా హెక్టార్లు



గురజాలలో వరి పొలం

ఖరీఫ్ ఆరంభంలోనే సాగర్ జలాశయం నిండటం, వర్షపాతం ఆశించిన దాని కంటే ఎక్కువ నమోదు కావడంతో పల్నాట ఎటుచూసినా పచ్చదనమే కనిపిస్తోంది. నరసరావుపేట నుంచి మాచర్ల, గుంటూరు నుంచి మాచర్ల.. ఇలా ఎటు వెళ్లినా దారుల వెంబడి కొందరు నాట్లు వేస్తుంటే.. మరికొందరు నారుమడులు మోస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు మిర్చి పొలాలు కనిపించేవి.. ఇప్పుడేమో వరిపొలాలు కనిపిస్తున్నాయని బస్సుల్లో రోజూ ప్రయాణాలు సాగించేవారు ఆశ్చర్యంగా చూస్తున్నారు. నీటి సదుపాయం పుష్కలంగా ఉండడంతో నిశ్చింతంగా రైతులంతా వరి వైపు మొగ్గుచూపారు. జిల్లాలో వరి సాగు సాధారణ విస్తీర్ణం 42 వేల హెక్టార్లు అయితే, ఇప్పటి వరకు 50 వేల హెక్టార్లు దాటింది. గతేడాది కేవలం పది వేల హెక్టార్లే కావడం గమనార్హం.

సాగర్ పుణ్యాన బీళ్లు భూములు కూడా ఈ ఏడాది పచ్చని మాగాణితో కళకళలాడుతున్నాయి. సాగర్ ఆయకట్టు దశ మారిపోయింది. 2022లో ఆగస్టు చివరి వారంలో వరద వస్తే.. ఈసారి ఆగస్టు 5నే వరద రావడంతో సాగర్ గేట్లు ఎత్తారు. అప్పటి నుంచి కుడికాల్వకు నీటి విడుదల కొనసాగుతూనే ఉంది. దీంతో రైతుల్లో సాగుపై ఆశలు పెరిగాయి. దీంతో వరి విత్తనాల కోసం కేంద్రాలకు బారులుతీరారు. ఒకానొకసమయంలో జగిత్యాల సన్నాల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ప్రైవేటు విత్తన దుకాణాల్లోనూ దొరకని పరిస్థితి. అంతలా వరి వేసేందుకు రైతులు ఎగబడ్డారు. వ్యవసాయ అధికారులే అంచనా వేయలేకపోయారు. వరి విత్తనాల కోసం రైతులు అంతలా ఆసక్తి కనబరుస్తారని ఊహించలేకపోయారు. మిర్చి, పత్తి వేస్తుంటారని, అలాంటిది ఈసారి వరి అధికంగా వేశారని అధికారులు వెల్లడించారు. మొన్నటి వరకు సాగుపై దిక్కుతోచని స్థితిలో.. కౌలుకు తీసుకుంటారా.. లేదా..? అని ఎదురుచూసిన రైతాంగం ప్రస్తుతం సాగు పనుల్లో బిజీగా అయిపోయారు. ముమ్మరంగా పనులు సాగుతున్నాయి. ఇదే సమయంలో కౌలు ధరలు పెరిగినా కూడా రైతులు పొలాలను తీసుకునేందుకు పెద్ద సంఖ్యలో ఆసక్తి కనబరిచారు.



మాచర్ల ప్రాంతంలో వరి నాట్లు

వరి నాటేందుకు అనుకూలంగా..: కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి ఏడాదిలోనే పొలాలన్నీ పచ్చగా కళకళలాడుతున్నాయి. అందరి అంచనాలను పటాపంచలు చేస్తూ ఈ ఏడాది వానలు అధికంగానే పడ్డాయి. దానికితోడు సాగర్ కుడికాల్వకు నీటిని విడుదల చేయడం కలిసొచ్చింది. ఈ నెల మొదటివారంలో కురిసిన వర్షాల వల్ల కృష్ణానదీ తీర ప్రాంతాల్లో అదీ వరద వల్ల పత్తి పొలాలు దెబ్బతిన్నాయి. అయితే ఆ వానలు పడే సమయానికి కొన్నిచోట్ల ఇంకా వరి నాటలేదు. ఆ సమయంలో వానలు అధికంగా పడటం కూడా కలిసొచ్చింది. వరి నాటేందుకు అనుకూలంగా మారింది.

ఎవరి కోసం దుబారా?

అంబులెన్స్ పేరుతో ఏఎన్‌యూలో నిధులు ఖర్చు

ఈనాడు, అమరావతి



హెల్త్ సెంటర్‌లో వినియోగించే అంబులెన్స్

అత్యవసర వైద్యం అవసరమైనపుడు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లడానికి అంబులెన్స్ అవసరమే. కానీ.. ఈ పేరుతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిధులు దారి మళ్లుతున్నాయి. వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులకు ప్రాథమిక వైద్యం అందించడానికి క్యాంపస్‌లోనే ఒక ఆరోగ్య ఉప కేంద్రం నడుస్తోంది. ఇది పీహెచ్‌సీ కాదు. ఇందులో ఇద్దరు వైద్యులు, పదిమందికిపైగా పారామెడికల్ ఉద్యోగులు ఉన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో వర్సిటీ కీలక అధికారి ఒకరు అవసరం లేకపోయినా తన బంధువులకు చెందిన వాహనాన్ని రెండో అంబులెన్స్‌గా తీసుకొచ్చారు. ఇలా మూడేళ్ల నుంచి నెలవారీ అద్దె చెల్లిస్తున్నారు. అంబులెన్స్‌ల కోసమని పగలు, రాత్రి వేళల్లో ముగ్గురు, నలుగురు డ్రైవర్లను నియమించి వారికి జీతభత్యాలు చెల్లిస్తున్నారు.

ఉద్యోగుల రాకపోకల కోసమా...

విద్యార్థులకు అత్యవసర వైద్య పరిస్థితులు ఏర్పడితే వెంటనే అంబులెన్స్ పంపాలి. అందుకు భిన్నంగా ఇక్కడున్న రెండు అంబులెన్స్‌లు చాలావరకు ఉద్యోగులను ఇళ్ల నుంచి ఆసుపత్రికి, ఆసుపత్రి నుంచి ఇళ్లకు తీసుకెళ్లడానికి ఉపయోగిస్తున్నారు. ఓ వైద్యుడైతే నిత్యం తన రాకపోకలన్నింటికీ ఒక అంబులెన్స్‌ను వాడుతున్నారు. వీటికి పెద్దమొత్తంలో నెలవారీ ఇంధన ఖర్చులు రాస్తున్నారు. ఒక్కో వాహనానికి నెలకు రూ. 40 వేలకుపైగానే అద్దె చెల్లిస్తున్నారు. డ్రైవర్లకు నెలకు రూ. 50 వేలకుపైగా చెల్లిస్తున్నట్లు తెలిసింది. అక్కడ రోజువారీ ఓపీ ఎంత? అవుతున్న వ్యయం ఎంతో ఓసారి బేరీజు వేసుకుంటే ఎంతమేర దుబారా అవుతోందో తెలుస్తుంది.

☛ వర్సిటీలో విద్యార్థులు, ఉద్యోగులు కలిపి దాదాపుగా 4 వేల మంది వరకు ఉంటారు. ఆరోగ్య ఉపకేంద్ర అధికారులు మాత్రం 8 వేలమంది వరకు ఉన్నారని లెక్క చెబుతున్నారు. నిత్యం ఓపీకి 70 మంది వస్తున్నారని కాకి లెక్కలేస్తున్నారు. ఈ కేంద్రంలో ఎవరూ అందుబాటులో ఉండడం లేదని వర్సిటీ ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు.

☛ వర్సిటీకి సమీపంలోనే ఉన్న ఎన్నారై ఆసుపత్రితో ఎంఓయూ ఉంది. మరోవైపు 20 కిలోమీటర్ల దూరంలో గుంటూరు ప్రభుత్వ బోధనాసుపత్రి ఉంది.

☛ ఈ విషయమై వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలాన్ని వివరణ కోరగా ఆరోగ్య కేంద్రం పనితీరు.. అంబులెన్స్‌లు.. వాటికవుతున్న వ్యయాలపై ఇటీవల ఆరా తీశామని చెప్పారు. ఖర్చు కొంచెం ఎక్కువగానే ఉందన్నారు. అంబులెన్స్‌కు చెల్లించే అద్దెతో ఇప్పటికే కొత్తది కొనుగోలు చేయొచ్చన్నారు. కానీ గత అధికారులు ఆ పని చేయలేదని, దీనిపై ఇంజినీరింగ్ విభాగాన్ని నివేదిక కోరామని తెలిపారు. అవసరమైతే ఒక అంబులెన్స్‌తోనే సేవలందించేలా చర్యలు తీసుకుని నిధుల దుబారాకు కళ్లెం వేస్తామన్నారు.

జిల్లాలో 342.8 మి.మీ. వర్షపాతం నమోదు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు 342.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చిలకలూరిపేట 75.2 మి.మీ., మాచర్ల 2.0 , రెంటచింతల 2.2 , గురజాల 3.4, దాచేపల్లి 6.6, పిడుగురాళ్ల 54.4, మాచవరం 5.2, బెల్లంకొండ 8.0, అచ్చంపేట 3.0, క్రోసూరు 1.4, అమరావతి 40.8, పెదకూరపాడు 8.0, సత్తెనపల్లి 2.8, రాజుపాలెం 3.0, నకరికల్లు 6.8, బొల్లాపల్లి 2.6, వినుకొండ 8.2, నూజండ్ల 22.6, శావల్యాపురం 14.0, ఈపూరు 7.8, రొంపిచర్ల 2.0, నరసరావుపేట 13.6, ముప్పాళ్ల 4.4, నాదెండ్ల 20.4, యడ్లపాడు 24.4 మి.మీ. వర్షం కురిసింది.

గుంటూరు మీదుగా ప్రత్యేక రైలు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంటూరు మీదుగా ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు మండల రైల్వే అధికారి తెలిపారు. ఈ రైలు(02811) అక్టోబరు 5 నుంచి నవంబరు 30వ తేదీ వరకు ప్రతి శనివారం భువనేశ్వర్‌లో 19.15 గంటలకు బయలుదేరి విజయవాడకు మరుసటిరోజు 07.25, గుంటూరు 08.35, నరసరావుపేట 09.20, యశ్వంతపూర్ సోమవారం 00.15 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు(02812) అక్టోబరు 7 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు ప్రతి సోమవారం యశ్వంతపూర్‌లో 04.30 గంటలకు బయలుదేరి నరసరావుపేట 18.29, గుంటూరు 19.20, విజయవాడ 21.30, భువనేశ్వర్ మంగళవారం 12.15 గంటలకు వెళ్తుందని పేర్కొన్నారు.

ఆత్మస్థైర్యానికి ఆలంబనగా..

ఒలింపిక్స్ పతక విజేత మనుబాకర్ తనకు భగవద్గీత అంటే ఇష్టమని విజయం సాధించిన సందర్భంలో తెలిపారు. ఏకాగ్రత కోసం, ఒత్తిడిని అధిగమించడానికి తాను తరచూ భగవద్గీత చదువుతూ ఉంటానని పేర్కొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్న తితిదే

గుంటూరు, న్యూస్‌టుడే

పురాణాలు, ఇతిహాసాల్లో భగవద్గీత గొప్పగ్రంథం. నేటి పోటీ ప్రపంచంలో చిన్నవారి నుంచి పెద్దవాళ్ల వరకు ఒత్తిడికి గురవుతున్నారు. ప్రధానంగా విద్యార్థులు ఇందుకు ఎక్కువగా లోనవుతున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించలేదని కొందరు, ర్యాంకులు సాధించలేదని మరికొందరు మానసిక క్షోభకు గురవుతున్నారు. విజయాన్ని తప్ప అపజయాలను తట్టుకునే శక్తిలేకపోవడం, గడ్డు పరిస్థితులు, ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం లేక బలహీనపడుతున్నారు. దీంతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించడానికి భగవద్గీత ఎంతగానో దోహదపడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే), హిందూ ధర్మప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) అధికారులు భావించారు.



గుంటూరు చేరిన పుస్తకాలు

జిల్లాకు చేరిన పుస్తకాలు : విద్యార్థులతో భగవద్గీత చదివించాలనే సంకల్పంతో వారికి ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. అందుకోసం భగవద్గీత సారాంశాన్ని సంక్షిప్తం చేసి 'మానవులందరికీ భగవద్గీత' పేరుతో పుస్తకాన్ని ముద్రించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థులకు ఉచితంగా అందివ్వడానికి సుమారు 50 లక్షల పుస్తకాలను ముద్రించారు. వీటిని అన్ని జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. గుంటూరు జిల్లాకు 20 వేలకు పైగా పుస్తకాలను కేటాయించారు. వాటిని జిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యాసంస్థల ప్రతినిధులు చిన్నపాటి పత్రంపై తమ వివరాలు, విద్యార్థుల సంఖ్యను తెలియజేస్తే సరిపోతుందని, పుస్తకాలు అందజేస్తామని అధికారులు తెలిపారు.

విద్యా సంస్థల నిర్వాహకులు సంప్రదించండి



జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా అందజేస్తాం. ఆసక్తి ఉన్న విద్యాసంస్థల నిర్వాహకులు గుంటూరు తితిదే కల్యాణమండపంలోని హెచ్‌డీపీపీ కార్యాలయంలో సంప్రదించొచ్చు. ఇతర వివరాలకు ఫోన్ నంబరులో 9989023329 మాట్లాడొచ్చు. **- అమ్మడు, హిందూ ధర్మప్రచార పరిషత్ సమన్వయకర్త**

కొండవీడులో జలకళ



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండవీడు కోటలోని పురాతన గొలుసుకట్టు చెరువులు జలకళ సంతరించుకున్నాయి. నలువైపులా ఉన్న ఎత్తైన కొండ శిఖరాల నుంచి జాలు వారిన వాననీరు చెరువుల్లోకి చేరుకుంది. ఎగువ భాగంలో ఉన్న వెదుళ్ల చెరువు నిండుకుండను తలపిస్తోంది. ముత్యాలమ్మ చెరువు, పుట్టలమ్మ చెరువులు నీటితో తొణికిసలాడుతూ పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. - న్యూస్‌టుడే, యడ్లపాడు

జలకళ సంతరించుకున్న వెదుళ్ల చెరువు

లింగాకర్షక బుట్టలతో గులాబీ రంగు పురుగు నివారణ



సూచనలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు శివకుమారి, మస్తానమ్మ

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు వినియోగించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి రైతులకు సూచించారు. మండలంలోని మురికిపూడి, రామచంద్రాపురంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రసం పీల్చు పురుగుల నివారణకు నీలిరంగు, పసుపు అట్టల వాడకంపై వివరించారు. నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ భూసార పరీక్షలు, విత్తనశుద్ధి, వేప గింజల కషాయం తయారీ పద్ధతులు సూచించారు. పశు వైద్యులు దీప్తి పశువుల్లో గాలికుంటు, గొంతువాపు వ్యాధులు, గొర్రెలకు టీకాలు, చూడు గేదెల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. యార్డు సూపర్‌వైజర్ బాబురావు సీసీఐ నుంచి పత్తి కొనుగోలు, రైతుబంధు కార్డుల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఏవో శ్రీలత, ఏఈవో శ్రీనివాసరావు, ఎంపీవోలు పాల్గొన్నారు.

వైకాపా పాలనలో పైసా ఇవ్వలేదు

వినుకొండ, న్యూస్‌టుడే : వైకాపా పాలనలో పురపాలక సంఘానికి పైసా డబ్బులివ్వలేదని, ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన రూ.3 కోట్లు వార్డుల్లో కాకుండా ఊరి బయట (గిరి ప్రదక్షిణ) రోడ్డుకు ఖర్చు చేయడం బాధ వేసిందని మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి తెలిపారు. తిమ్మాయిపాలెం రోడ్డులోని వై కన్వెన్షన్ హాల్లో బుధవారం మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సొంతపార్టీపై ఈ వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఆదాయం ఏడాదికి రూ.12 కోట్లు ఉంటే అందులో జీతభత్యాలు, నిర్వహణ ఖర్చు పోను మిగిలిన కొద్దిపాటి సొమ్ముతో సమస్యలు పరిష్కరించలేక పోతున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సహకరిస్తే శక్తివంచన లేకుండా ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని చెప్పారు.

మేనరికాలతో అవయవ లోపాలు

బొల్లాపల్లి, వినుకొండ, న్యూస్‌టుడే : మేనరిక వివాహాల వల్ల పిల్లలు అవయవ లోపాలతో పుడుతున్నారని శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే ఆంజనేయులు సతీమణి జి.లీలావతి తెలిపారు. మండలంలోని వెల్లటూరులో బుధవారం కమిట్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని 100 మంది దివ్యాంగులకు ఆమె చేతుల మీదుగా ఉపకరణాలు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు అభిమన్యు, సుదీప్, తెదేపా నాయకులు నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదిమ గిరిజనుల సంక్షేమానికి ప్రణాళికలు

- పీఎం జన్‌మన్‌లో 11 రకాల వసతులు
- తొమ్మిది శాఖల సంయుక్త కార్యచరణ
- జిల్లాలో 51 ఆవాస ప్రాంతాలకు వర్తింపు

వినుకొండ, నరసరావుపేట అర్బన్, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

గిరిజనుల్లో అత్యంత వెనుకబడిన ఆదిమ గిరిజనుల సాధికారతకు కేంద్రం పీఎం జన్‌మన్ కార్యక్రమం అమలు చేస్తోంది. దేశవ్యాప్తంగా 75 జాతులను గుర్తించి వారి నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, జీవన ప్రమాణాల మెరుగుకు వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ (పీఎం- జన్‌మన్) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది.

ఏం చేస్తారంటే..

అందరికి పక్కా ఇళ్లు, ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి, గ్రామానికి రహదారి, విద్యుత్తు సౌకర్యాలు, విద్య, నైపుణ్య వికాసం, వైద్యం కోసం సంచార వాహనం, ఆరోగ్య కార్యకర్త నుంచి మెరుగైన ఆరోగ్య సదుపాయం, వందకన్నా తక్కువ జనాభాకు అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసి పౌష్టికాహారం అందిస్తారు. జీవనోపాదులు మెరుగు పరచడం, ప్రచార సాధనల సౌకర్యానికి అవసరమున్న చోట మొబైల్ టవర్లు ఏర్పాటు చేస్తారు. వీటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేస్తారు. ఇప్పటి వరకు లేని వారికి కొత్తగా మంజూరు చేస్తున్నారు.



బొల్లాపల్లి మండలం రేమిడిచెర్ల చెంచుకాలనీ వాసులతో కలిసి కరపత్రాలు విడుదల చేస్తున్న ఐటీడీఏ అధికారి ధనుంజయ్ తదితరులు

కార్యచరణ సిద్ధం చేసింది. పల్నాడు జిల్లాలోని 6 మండలాల్లో 51 చెంచుల ఆవాస ప్రాంతాల్లో వీటిని అమలు చేయనున్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసి కార్యక్రమాల గురించి అవగాహన కల్పిస్తున్నారు.

❖ గిరిజన వర్గాల్లో ఆర్థిక వెనుకబాటుతనం, తక్కువ అక్షరాస్యత ఉన్న వారిని ఆదిమ వర్గాలుగా భావిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో నివాసం వల్ల వారు మౌలిక సదుపాయాలు లేక అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు. వాటిని పరిష్కరించే దిశగా కేంద్రం చర్యలు చేపట్టింది. గిరిజన

పల్నాడు జిల్లాలో..

ఇల్లు లేని వారికి కొత్తగా 608 ఇళ్లు మంజూరు చేశారు. 19 ఆవాస ప్రాంతాలకు తాగునీటి సరఫరా, 11 మొబైల్ మెడికల్ యూనిట్లు, 16 వసతి గృహాలు, 18 అంగన్‌వాడీ కేంద్రాలు, 782 ఇళ్లకు విద్యుత్తు కనెక్షన్లు, మొబైల్ టవర్లు 8 ఏర్పాటు చేస్తారు. వీటితో పాటు 29 కి.మీ. నిడివి రహదారులు నిర్మిస్తారు. ప్రభుత్వ పథకాలు అందించేందుకు లేనివారికి జనన ధ్రువపత్రాలు, ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తారు. అంతేకాకుండా ఇప్పటి వరకు రికార్డుల్లో నమోదు కాని వారి కోసం సర్వే చేపట్టారు. వీటిని నిర్ణయించిన కాలమానిక ప్రకారం పూర్తి చేయాలని నిర్దేశించారు. ❖ చిలకలూరిపేట నియోజకవర్గంలో బొప్పూడి, గొట్టిపాడు, కట్టుబడివారిపాలెం, బోయపాలెం, నాదెండ్ల, సాతులూరు, యడ్లపాడులో గిరిజనులు ఎక్కువగా నివసిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో కొన్ని కాలనీల్లో సరైన మౌలిక సదుపాయాలు లేవు. వీటిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

వివరాలు

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో గిరిజన జనాభా : **1,41,944**
ఇందులో చెంచులు : **7235**
చెంచుకాలనీలు, గూడేలు : **51**

అవగాహన సదస్సులు పెట్టాం

పీఎం జన్‌మన్ ఉద్దేశాలను గ్రామసభలు పెట్టి వివరించాం. నిర్దేశించినట్లు 11 రకాల వసతుల కల్పనకు ఆయా శాఖల అధికారులు కలిసి పని చేస్తారు. ఇప్పటి వరకు నమోదు కాని వారి కోసం వినుకొండ, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో మరోసారి సర్వే చేస్తున్నారు. **- ధనుంజయ్, ఐటీడీఏ, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్**

ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఆంజనేయులు. చిత్రంలో అరసవిల్లి కృష్ణ, శ్రీనివాస్, సుబ్బారావు, సురేష్‌కుమార్ తదితరులు

గాంధీనగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: చిలకలూరిపేట బస్సు దహనం కేసులో 32 ఏళ్లుగా జైల్లో ఉన్న చలపతి, విజయవర్ధన్‌లను ప్రభుత్వం బేషరతుగా విడుదల చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.ఆంజనేయులు కోరారు. బుధవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చేసిన తప్పునకు మూడు జీవిత ఖైదీలు అనుభవిస్తున్నారని.. ఇంత శిక్ష అనుభవించినా విడుదల చేయకపోవడం సరికాదన్నారు. వారిద్దరూ దళిత కుటుంబాలకు చెందిన పేదవారని, వారిలో మార్పు వచ్చిందని, విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. 1999లో పరిటాల రవిని లక్ష్యంగా చేసుకొని హైదరాబాద్‌లో మద్దెలచెరువు సూరి ఏర్పాటు చేసిన ల్యాండ్‌మైన్ పేలి 26 మంది చనిపోయారని చెప్పారు. ఆ కేసులోని నిందితులంతా పదేళ్ల జైలు శిక్ష పూర్తి చేసుకొని విడుదలయ్యారని గుర్తు చేశారు. బస్సు దహనం కేసు నిందితులు దళితులు అవ్వడం వల్లే జైల్లో మగ్గిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వివిధ జైళ్లలో 60 ఏళ్లు నిండి, 14 సంవత్సరాల జైలు శిక్ష పూర్తి చేసుకున్న ఖైదీలను విడుదల చేయాలని విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ కోరారు. దీనిపై అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా గుంటూరులో బహిరంగ సభ నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, దుర్గం సుబ్బారావు, సురేష్‌కుమార్, రోహిత్, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి గురించి తెలిస్తే ఫిర్యాదు చేయాలి

బొల్లాపల్లి, వినుకొండ, న్యూస్‌టుడే : ప్రభుత్వ రంగ సంస్థల్లో అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని చైతన్య గోదావరి బ్యాంకు ఆర్ఎం శ్రీనివాస్ కోరారు. బొల్లాపల్లి మండలం వెల్లటూరులో బుధవారం బ్యాంక్ ఏర్పాటు చేసిన అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా ఖాతాదారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ అవినీతిపై ఫిర్యాదు చేసిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని తెలిపారు. రైతులకు పంట, బంగారం, వ్యవసాయ పరికరాలకు రుణాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ రాయితీలకు బ్యాంకు సేవలందిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా హాజరైన వారితో లంచం ఇవ్వం.. తీసుకోం అంటూ ప్రమాణం చేయించారు.

ప్రత్తిపాటి చిన నారాయణమ్మకు నివాళి



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి చిన నారాయణమ్మ సంస్మరణ సభ స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఇటీవల అనారోగ్యంతో ఆమె మృతి చెందారు. ఆమె కుమారుడు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కోడలు వెంకటకుమారితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జీవీ ఆంజనేయులు, బూర్ల రామాంజనేయులు, చదలవాడ అరవింద బాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి, చింతమనేని ప్రభాకర్, తెనాలి శ్రావణ్‌కుమార్, కొలికపూడి శ్రీనివాసరావులు ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. తెదేపా సీనియర్ నేత, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, మక్కెన మల్లికార్జునరావు, బొల్లినేని వెంకట రామారావు, నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ, దర్శి నియోజకవర్గ తెదేపా బాధ్యురాలు గొట్టిపాటి లక్ష్మి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, సినీ నిర్మాత, నటుడు కొల్లా అశోక్‌కుమార్‌తో పాటు తెదేపా, జనసేన, భాజపా నాయకులు నివాళి అర్పించారు.

అవసరమున్నా.. అలంకరణ ప్రాయమే..



బస్టాండ్ రోడ్డులో పనిచేయని సిగ్నల్ లైట్లు

జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ట్రాఫిక్ పెద్ద సమస్యగా తయారైంది. ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు నిరుపయోగంగా మారాయి. పట్టణ ప్రధాన కూడళ్లలో వీటిని వినియోగంచకపోవడంతో చిక్కులు ఎదురవుతున్నాయి. గాంధీ పార్కు రైల్వే దిగువ వంతెన కూడలి వద్ద పురపాలక సంఘం, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని రైల్వే పైవంతెన ఆరంభంలో ఐటీసీ సంస్థ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు పనిచేయడం లేదు. **-న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్**



గాంధీ పార్కు వద్ద వెలగని ట్రాఫిక్ లైట్లు

తేమ ఉండేలా... మొక్కలు బతికేలా



రొంపిచర్లలో నీటి తేమ ఎక్కువ సేపు ఉండేలా కప్పిన పాలిథిన్ కవర్లు

నీటి సంరక్షణ.. నాణ్యమైన దిగుబడుల కోసం అన్నదాతలు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్నారు. రొంపిచర్లలో ఇండియన్ గ్యాస్ గోదాం వద్ద ఓ రైతు వంగ, టమాట తోట సాగు చేస్తున్నాడు. నీటివసతి లేకపోవటంతో నేల బావి వద్ద డ్రిప్ పద్ధతిలో కూరగాయల మొక్కలకు నీటితడులు అందిస్తున్నాడు. ఎండలకు భూమిలో తేమ త్వరగా ఆరిపోకుండా పాలిథిన్ కవర్లతో కప్పి ఉంచారు. అంతేగాక క్రిమికీటకాలు ఆశించకుండా కవర్లు రక్షణగా ఉంటాయని, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని అన్నదాత తెలిపాడు. **-న్యూస్‌టుడే, నరసరావుపేట వ్యవసాయం**



టమాట మొక్కలను కప్పిన పాలిథిన్ కవర్

విద్యుత్తు స్మార్ట్ మీటర్లు వచ్చేశాయ్...

రీఛార్జి చేసుకుంటేనే సరఫరా



స్మార్ట్ విద్యుత్తు మీటర్

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: విద్యుత్తు స్మార్ట్ మీటర్లు వచ్చేశాయ్.. సెల్ ఫోన్‌కు రీఛార్జి ఎలా చేస్తామో వీటికి అలాగే చేసుకుంటేనే విద్యుత్తు సరఫరా అవుతుంది. లేదంటే సరఫరా రాదు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ విద్యుత్తు మీటర్లు ముందుగా ప్రభుత్వ శాఖల్లో ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లోని పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్నారు. మరో ఆరు నెలల్లో ఇళ్లకు ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్తు అధికారులు తెలిపారు.

నేరగాళ్లు యాత్రలు చేస్తే దేవుళ్లు పారిపోతారు : జీవీ

వినుకొండ, న్యూస్‌టుడే : రథాలు తగులబెట్టింది, విగ్రహాలు ధ్వంసం చేసిన వైకాపా నాయకులు... ఇప్పుడు ఆలయ సందర్శన యాత్రలు చేపడితే వారిని చూసి దేవుళ్లు పారిపోతారని శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు విమర్శించారు. తన కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే మక్కెనతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. సంప్రదాయాలకు విరుద్ధంగా తిరుమల సందర్శనలో జగన్ ఎందుకు డిక్లరేషన్ ఇవ్వలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన నాస్తికుడని డబ్బు మతం తప్ప మరొకటి లేదన్నారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడిన అపచారానికి ముందు క్షమాపణలు చెప్పాలని కోరారు. అవినీతి పరులను పాలకవర్గ సభ్యులుగా చేస్తే ఇలాగే ఉంటుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో తెదేపా నాయకులు కోటిరెడ్డి, వీవీ సురేష్,మురళీ కృష్ణయాదవ్, పత్తి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కు రూ.లలో)

ఎన్టీఆర్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, లిఫ్టింగ్ ధర - 148, విత్ స్కిన్ - 215, విత్ స్కిన్‌లెస్ - 244.
కృష్ణా జిల్లా: ఎన్టీఆర్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 లిఫ్టింగ్ ధర 143 విత్ స్కిన్ - 207, విత్ స్కిన్‌లెస్ - 236.
ఏలూరు/ కృష్ణా ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 విత్ స్కిన్ - 248 విత్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 555 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

ఘనంగా ఫార్మాసిస్ట్ దినోత్సవం

నరసరావుపేట అర్బన్: ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం సందర్భంగా పలు ఫార్మసీ కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఏఎం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో మందుల వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని విద్యాసంస్థల ఛైర్మన్ ఎమ్మార్ శేషగిరిరావు ప్రారంభించారు. అనంతరం కళాశాలలో వైద్యచికిత్సల్లో ఫార్మాసిస్ట్ పాత్ర గురించి డాక్టర్ బండ్ల రాంచంద్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాదరావు, విభాగాధిపతులు పాల్గొన్నారు. చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో జొన్నలగడ్డలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ఎస్‌కే ప్రసాదరావు పాల్గొన్నారు. నరసరావుపేట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జేఎన్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

రాష్ట్రస్థాయి జూడో స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ



రజత పతకం సాధించిన అమూల్య

చిలకలూరిపేట పట్టణం : ఏపీ స్కూల్ గేమ్స్ అండర్- 14 విభాగంలో 22 నుంచి 23 వరకు తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాల 9వ తరగతి అమూల్య 45 కిలోల విభాగంలో రజత పతకం సాధించింది. పోటీల్లో గుంటూరు జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో మూడో స్థానం సాధించిన విద్యార్థినిని బుధవారం గుంటూరు జిల్లా డీఈవో శైలజ, పల్నాడు జిల్లా డీవో ఎం.వెంకటేశ్వర్లు, ఏఎంజీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్, ప్రధానోపాధ్యాయుడు కె.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? నరసరావుపేట బాలయ్య నగర్ మూడో లైను చివరలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళలో కుక్కలు రోడ్డు మధ్యలో ఉండటం వల్ల కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. చీకట్లో ఇబ్బందిగా ఉంటుంది. **- రమేష్, స్థానికుడు**

? నరసరావుపేట ఇస్లాం పేట మొదటి లైను నుంచి అక్కడక్కడ వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులే పట్టించుకోవాలి.
- షరీఫ్ బాషా, స్థానికుడు

✔ సిబ్బందికి తెలియజేసి వీధి దీపాలు అమరుస్తాం. **- శేఖర్, వీధి దీపాల పర్యవేక్షణాధికారి, నరసరావుపేట**

– న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట)

? బొప్పూడి గుడి నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే భయమేస్తోంది.
-బొల్లు శంకరరావు, బొప్పూడి

✔ రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.
-రవీంద్ర, ఆర్ అండ్ బీ ఏఈ

? వేలూరులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గ్రామంలో తిరగాలంటే కుక్కలు వెంట పడుతున్నాయి. **-గోపి, వేలూరు**

✔ కుక్కలు పట్టించి దూరంగా వదిలిపెట్టేలా చర్యలు తీసుకుంటాం.
-శ్రీనివాసరావు, ఎంపీడీవో

–న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

ప్రయాణం.. ఇక సౌకర్యం

★ గుండ్లకమ్మ నదిపై రెండు వంతెనల నిర్మాణం
★ జాతీయ రహదారులకు అనుసంధానం

వినుకొండ, వినుకొండ రూరల్, న్యూస్‌టుడే



వంతెన నిర్మించే ప్రాంతాన్ని సందర్శించిన పీఐయూ ఈఈ రమేష్ డీఈఈ కొండయ్య తదితరులు

గుండ్లకమ్మ నదిపై రెండు వంతెనలు నిర్మిస్తున్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కార్యక్రమంలో వీటికి రూ.35.83 కోట్లు మంజూరయ్యాయి. వినుకొండ నియోజకవర్గ పరిధిలోని సుమారు 10 గ్రామాలకు వీటి ద్వారా జాతీయ రహదారులకు అనుసంధానం ఏర్పడుతుంది. తద్వారా ప్రయాణం సులువు కానుంది.

★ వినుకొండ మండలం ఎ.కొత్తపాలెం వద్ద గుండ్లకమ్మపై రూ.15.83 కోట్లతో హైలెవెల్ వంతెన నిర్మిస్తున్నారు. పది కానాలు ఏర్పాటు చేసి సుమారు 250 మీటర్ల నిడివి, 7.5 మీటర్ల వెడల్పుతో పనులు చేస్తున్నారు. రెండేళ్లలో పూర్తి చేయాలని గుత్తేదారుతో ఒప్పందం చేసుకున్నారు. ఈ వంతెన పూర్తయితే నూజండ్ల మండలం మృత్యుంజయపురం, లింగముక్కపల్లె, నాగిరెడ్డిపల్లెలు నుంచి నేరుగా కొత్తపాలెం వద్ద అనంతపురం- గుంటూరు జాతీయ రహదారికి చేరుకోవచ్చు. ఏడాదిన్నర క్రితం పీఎంజీఎస్‌వై నిధులు రూ.3.65 కోట్లతో గుండ్లకమ్మకు రెండు వైపులా 5 కి.మీ. తారు రోడ్డు నిర్మించారు.

★ వినుకొండ మండలం గోకనకొండ వద్ద నదిపైన హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.20 కోట్లు పీఎంజీఎస్‌వై నిధులు మంజూరయ్యాయి. 11 కానాలతో 264 మీటర్ల పొడవు, 7.5 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారు. వైఆర్‌కే నిర్మాణ సంస్థ 16 నెలల్లో నిర్మిస్తుంది. నూజండ్ల మండలం పువ్వాడ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రకాశం జిల్లా కుందుర్రు మీదుగా అద్దంకి, నార్కట్‌పల్లె జాతీయ రహదారికి నేరుగా చేరుకోవచ్చు. ఏడాదిన్నర క్రితం నది వరకు రెండు వైపులా రూ.6 కోట్లతో 10.27 కి.మీ. తారు రోడ్డు నిర్మించారు. వంతెన పూర్తయితే రహదారుల అనుసంధానం మెరుగవుతుంది. తద్వారా రవాణా సౌకర్యం సులువుగా మారుతుంది.

త్వరలో పనులు ప్రారంభం

రెండు చోట్ల వంతెనల నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చాయి. శంకుస్థాపన పూర్తికాగానే పనులు మొదలుపెడతారు. వీటి ద్వారా ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుంది. **-కొండయ్య, డీఈఈ, పంచాయతీరాజ్ పీఐయూ, వినుకొండ**

అధికారుల అలసత్వం.. ప్రజలకు శాపం

★ ఉమ్మడి సర్వే నంబరులో వక్ఫ్‌బోర్డు ఆస్తులు
★ సబ్ డివిజన్ చేయని అధికారులు

యడ్లపాడు, చిలకలూరిపేట గ్రామీణ న్యూస్‌టుడే

సచివాలయ వ్యవస్థ.. పారదర్శక పాలన, ప్రజల వద్దకు పాలన.. అంటూ ప్రజాప్రతినిధులు తరచుగా ఉదరగొడుతుంటారు. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు రెవెన్యూ సమస్యలతో పడే బాధలు అన్నీఇన్నీ కావు. విధి నిర్వహణలో అధికారుల అలసత్వం, సమన్వయ లోపంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

★ వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణకు హైకోర్టు తీర్పు మేరకు.. రాష్ట్రంలో ఆ బోర్డుకు చెందిన స్థిరాస్తుల వివరాలు రిజిస్ట్రార్ కార్యాలయాలకు అందజేశారు. ఆ సర్వే నంబర్లతో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. చాలా గ్రామాల్లో ఒకే సర్వే నంబరులో ఉమ్మడిగా వక్ఫ్ భూములు, ప్రైవేటు భూములు కలిసి ఉన్నాయి. ఉమ్మడి సర్వే నంబర్లతో ఇళ్లు, సాగు భూములు ఉన్నాయి. గ్రామ కంఠాల్లో సైతం ఇదే మాదిరిగా ఉన్నాయి. ఉమ్మడి సర్వే నంబరు ఉన్నచోట రెవెన్యూ అధికారులు జారీ చేసిన నిరభ్యంతర పత్రంతో ప్రైవేటు ఆస్తులను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి వక్ఫ్‌బోర్డుకు చెందిన ఆస్తులకు ప్రత్యేక సర్వే నంబరు కేటాయించి సబ్ డివిజన్ చేయాలి. ఈ ప్రక్రియను అధికారులు పట్టించుకోలేదు. చిలకలూరిపేట నియోజకవర్గంలో పట్టణం, గ్రామీణ మండలంలో పలు గ్రామాలు, యడ్లపాడు మండలంలో ఇలాంటి సమస్య ఉంది. ఆయా గ్రామాల ప్రజలు నిరభ్యంతర పత్రాల కోసం రోజుల తరబడి తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మామూళ్లు ఇచ్చుకుని వాటిని పొందుతున్నారు.

దరఖాస్తు చేయాలి

లింగారావుపాలెం గ్రామ కంఠంలోని 46వ సర్వే నంబరులో పీర్ల చావిడి చెందిన సెంటు భూమి ఉంది. సదరు భూమిని సబ్ డివిజన్ చేస్తే గ్రామంలోని ఇళ్లకు, స్థలాలకు రిజిస్ట్రేషన్ సమయంలో నిరభ్యంతర పత్రం అవసరం లేదు. ఇందుకు వక్ఫ్‌బోర్డు అధికారులు పీర్లచావిడిని సబ్ డివిజన్ చేయాలని మాకు దరఖాస్తు చేయాలి. మాకు మేముగా చేసే అధికారం లేదు. **-విజయశ్రీ, తహసీల్దార్, యడ్లపాడు**

సబ్ డివిజన్ చేయాలని దరఖాస్తు చేస్తాం

లింగారావుపాలెంలో పీర్లచావిడి గ్రామకంఠం కలిసి ఉండటం మూలంగా గ్రామస్థులు ఇళ్లు, స్థలాలు రిజిస్ట్రేషన్, తనఖా చేయించుకోవటానికి ఇబ్బంది పడుతున్నట్లు మా దృష్టికి రాలేదు. పీర్లచావిడిని సబ్ డివిజన్ చేయాలని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేస్తాం.
-కరీముల్లా, వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్

వారు తెమ్మంటారు.. వీరు కుదరదంటారు

మా గ్రామ కంఠంలోని సర్వే నంబరు 46లో పీర్ల చావిడి కూడా కలిసి ఉంది. స్వగ్రామంలోని ఇంటిపై బ్యాంకు రుణానికి అవసరమైన కుదువ పత్రం కోసం చిలకలూరిపేట రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా రెవెన్యూ అధికారుల ద్వారా నిరభ్యంతర పత్రం తెచ్చుకోవాలని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయానికి రాగా ఇవ్వటం కుదరదని చెప్పారు. వివాదాలు లేని పూర్వీకుల నుంచి సంక్రమించిన ఇంటికి కూడా నిరభ్యంతర పత్రం అడగటం దారుణం. **-గుంటుపల్లి రమణయ్య, లింగారావుపాలెం, యడ్లపాడు మండలం**

పట్టు పురుగుల పెంపకంతో ఆదాయం

యడ్లపాడు, న్యూస్‌టుడే: పట్టు పురుగుల పెంపకం రైతులకు లాభసాటిగా ఉంటుందని జిల్లా సెరీ కల్చర్ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని కొండవీడు, చెంఘీజ్‌ఖాన్‌పేటలో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి సస్య రక్షణ చర్యలు వివరించారు. ఏవో సీహెచ్ సరిత, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగంగుంట్ల శ్మశానవాటికల్లో గ్రామ కమిటీ సభ్యులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది మొక్కలు నాటారు. రోడ్లు శుభ్రపరచి మురుగు కాలువల్లో సిల్టు తొలగించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది బాషా, కోటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

నూజండ్ల : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం బుధవారం భూమాయపాలెం, జడ్డావారిపాలెం, సీతారాంపురంలో నిర్వహించారు. విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో రవికుమార్, మండల కో- ఆర్డిటర్ సుబ్బరామయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



రొంపిచర్ల విద్యుత్తు ఉప కేంద్రం వద్ద బోర్డు ఏర్పాటు చేయిస్తున్న రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై అశోక్

రొంపిచర్ల, న్యూస్‌టుడే : అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని రాష్ట్రీయ రహదారి పరిధిలో రొంపిచర్ల పోలీసులు ప్రమాదాలు జరిగే ప్రాంతాలైన రొంపిచర్ల విద్యుత్తు ఉప కేంద్రం సమీపంలో, పలు చోట్ల రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై అశోక్ హెచ్చరిక బోర్డులను బుధవారం ఏర్పాటు చేశారు.

నీట మునిగిన పాఠశాలలు, లోతట్టు ప్రాంతాలు



సంజీవనగర్ మున్సిపల్ పాఠశాల గదుల్లో చేరిన వర్షం నీరు

చిలకలూరిపేట పట్టణం: చిలకలూరిపేటలో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది. స్థానిక సంజీవనగర్‌లోని ఉన్న మురుగునీటి కాల్వలు పొంగి సమీపంలో ఉన్న లూథరన్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోకి భారీగా వర్షంనీరు వచ్చి చేరాయి. దీంతో పాఠశాల పక్కనే ఉన్న బావి పూర్తిగా నిండింది. పాఠశాలలో ఉన్న నాలుగు గదుల్లో, ఆవరణలో నీరు చేరాయి. బియ్యం బస్తా, కోడిగుడ్లు, పుస్తకాలు తడిశాయి. కమిషనర్ పి.శ్రీహరి బాబు పారిశుద్ధ్య కార్మికులను పంపి నీటిని తోడించారు. ఎంఈవో లక్ష్మి, హెచ్‌ఎం. శైలజ నీటిని పాఠశాల పరిశీలించారు.

నరసరావుపేట సెంట్రల్ : పట్టణంలో చిన్నపాటి వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బుధవారం కురిసిన వర్షానికి చిలకలూరిపేట పై ఓవర్ బ్రిడ్జి పక్క మార్గం, మార్కెట్ సెంటర్, బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద, పల్నాడు రోడ్డులో వర్షపు నీరు నిలిచింది. ఇది పోయే మార్గం లేక పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.

నూజండ్ల : అల్ప పీడన ప్రభావంతో మంగళవారం, బుధవారం కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీ మొత్తం వాగునీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.



కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలో వర్షపు నీరు



నరసరావుపేట : చిలకలూరిపేట మార్గంలో పైవంతెన పక్క రోడ్డులో నిలిచిన వర్షపునీరు

లాభసాటి వ్యవసాయానికి పొలం పిలుస్తోంది నాంది



కార్యక్రమంలో ఎమ్మెల్యే చదలవాడ, ఏవో తదితరులు

రొంపిచర్ల, న్యూస్‌టుడే : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లో వ్యవసాయ శాఖ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మాచవరంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మండల వ్యవసాయాధికారిణి శివలలిత, పశు వైద్యులు శ్రీకాంత్, వీఏఏలు వేమారెడ్డి, విజయలక్ష్మి, తెదేపా నేతలు కోటిరెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ రూరల్ : రైతులకు వ్యవసాయం ఒక పండగలా ఉండాలని, లాభదాయకంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్రంలో 100 రోజుల పాలనలోనే రైతులకు కూటమి ప్రభుత్వం కొండత అండగా నిలిచిందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఉమ్మడివరంలో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి రైతు కుటుంబం ఆర్థికంగా బలపడాలని తమ ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుందన్నారు. పొలాలు పరిశీలించి రైతులతో మాట్లాడి గోడ పత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఏ రవిబాబు, జనసేన నేత నిశ్శంకరావు శ్రీనివాసరావు, మాదినేని ఆంజనేయులు, వీరగంధం ఆనంద్, మక్కెన కొండలు పాల్గొన్నారు.

నరసరావుపేట సెంట్రల్ : మండలంలోని పెద్దరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పత్తి పంటను పరిశీలించారు. ఏవో నరేంద్రబాబు, ఏఈవో బ్రహ్మయ్య, పవన్‌కుమార్, పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సాగు పద్ధతులతో అధిక దిగుబడులు

నూజండ్ల : శాస్త్రీయ పద్ధతులతో సాగు చేస్తే దిగుబడులు పెరిగి రైతులకు లాభాలు వస్తాయని మండల వ్యవసాయాధికారి సుగుణా బేగం అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ముక్కెళ్లపాడు, ఐనవోలు రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. పెట్టుబడులు తగ్గించుకొనే విధానాలు వివరించారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి పథకాల అమలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, వేదికపై మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, న్యూస్‌టుడే : గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తన స్వప్రయోజనాల కోసం గిరి ప్రదక్షణ రోడ్డు పేరుతో పురపాలక సంఘ నిధులు ఖర్చు చేశారని కూటమి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. కొండ చుట్టూ భూములు కొన్న తర్వాత వాటి విలువ పెంచుకునేందుకు జనాసొమ్ము ఖర్చు చేయాల్సిన డబ్బును అక్కడికి మళ్లించినట్లు ఆరోపించారు. తిమ్మాయిపాలెం రోడ్డులోని వై కన్వెన్షన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను ఎట్టి పరిస్థితిలో అలాంటి అపరాధం చేయనని తెలిపారు. తృణధాన్యాలతో తయారు చేసే అప్పడాలు, వడియాల వంటి ఆహార ఉత్పత్తులకు మార్కెట్లో మంచి గిరాకీ ఉన్నందున డ్వాక్రా సంఘాల సభ్యులు వాటిపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోరారు. మామంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, మెప్మా టీఎంసీ మహ్మద్‌బాషా, తెదేపా నాయకులు షమీమ్ ఖాన్, ఆయూబ్‌ఖాన్, పీవీ సురేష్, సౌదాగర్ జాని తదితరులు పాల్గొన్నారు.

నూజండ్ల : ఇచ్చిన మాట ప్రకారం పథకాలను ప్రజలకు అందిస్తున్నట్లు ఈవోపీఆర్డీ రవికుమార్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం బుధవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించడంతో పాటు స్టిక్కర్లు అంటించారు. వీఆర్వో నరేంద్ర, కార్యదర్శి మాల్యాద్రి సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలూరిపేట పట్టణం : పట్టణంలోని 35వ వార్డులో సచివాలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేశారు. పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్కే రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, నేతలు పాల్గొన్నారు.

రొంపిచర్ల : నియోజకవర్గంలో ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని, కష్టాల్లో కుటుంబ సభ్యుడిగా తోడుగా ఉంటానని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని వీరవట్నంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా రాష్ట్ర నాయకులు నల్లపాటి రామచంద్రప్రసాద్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, నేతలు పాల్గొన్నారు.



నూజండ్ల : ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న అధికారులు

చిలకలూరిపేట గ్రామీణ : మండలంలోని బొప్పూడిలో కూటమి వంద రోజుల పాలనపై ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తూ బుధవారం కరపత్రాలు పంచారు.

స్వర్ణాంధ్ర గోడప్రతుల ఆవిష్కరణ

చిలకలూరిపేట పట్టణం : స్థానిక 8వ వార్డు సచివాలయంలో స్వర్ణాంధ్ర-2047 గోడప్రతులు బుధవారం ఆవిష్కరించారు. వార్డు కౌన్సిలరు కొత్త కుమారి మాట్లాడుతూ విజన్ స్వర్ణాంధ్ర- 2047లో ప్రజలను భాగస్వాములు చేస్తూ, ప్రతి వార్డు నుంచి వారి సలహాలు, సూచనలు సేకరించాలని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. నోడల్ అధికారి ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఒకటో పట్టణ సీఐ విజయ్ చరణ్ పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. రెండో పట్టణ ఎస్సై అశోక్ ఉన్నారు.

మెరుగైన బోధన అందించాలి

యడ్లపాడు : నరసరావుపేట ఉప విద్యా శాఖ అధికారి వేణుగోపాల్ బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠ్యాంశాల బోధన ప్రణాళిక అమలు తీరు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నిర్వహణ తనిఖీ చేశారు.



దుకాణంలోకి నగదు తీసుకుంటున్న దొంగ

వస్త్ర దుకాణంలో చోరీ

రొంపిచర్ల, న్యూస్‌టుడే : రొంపిచర్లలోని చెరువుకట్ట సెంటర్‌లోని వస్త్ర దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి బుధవారం చోరీ చేశాడు. దుకాణం షట్టర్ పైకి లేపి లోపలికి ప్రవేశించి క్యాష్ కౌంటర్‌లోని నగదు ఎత్తుకెళ్లాడు. ఉదయం దుకాణం తెరిచిన యజమాని మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లారు. సాయంత్రం రాగా షట్టర్ తెరిచి ఉండటాన్ని గమనించి పరిశీలించగా నగదు కనిపించలేదు. సీసీ కెమెరా దృశ్యాల్లో నగదు ఎత్తుకెళ్లే దృశ్యాలు కనిపించాయి. సుమారు రూ.10 వేల వరకు పోయిందని దుకాణం యజమాని తెలిపారు.

మిరప నారు, మందులు చోరీ

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : అందుగుల కొత్తపాలెంలోని షేడ్‌నెట్‌లో రూ.55 వేల మిరప నారు, తైవాన్ స్ప్రేయర్, మందులను దొంగలు చోరీ చేశారు. బాధితుడు పిడికిటి వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. గ్రామానికి కొంత దూరంలో చెరువు సమీపంలో షేడ్‌నెట్ ఏర్పాటు చేసి ఇతను నారు పెంచి అమ్ముతుంటాడు. రాత్రి వేళ ఇంటికి వచ్చాక దొంగలు షేడ్‌నెట్ కోసి అందులోని రూ.15 వేల విలువైన మిరపనారు, రూ.15 వేల తైవాన్ స్ప్రేయర్, రూ.25 వేల సేంద్రియ మందులు ఎత్తుకెళ్లారు. రెండేళ్ల క్రితం ఇలాగే దొంగలు పడి రూ.60 వేల విలువైన నారు, మందులు దొంగలించారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపాడు.

అవీ ఇవీ

సూపర్-6 పథకాలు అమలు చేయాలి

నరసరావుపేట అర్బన్ : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్- 6 పథకాలను అమలు చేయాలని డీసీసీ అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపు మేరకు కలెక్టరేట్ల వద్ద థాలీ బజావో పేరిట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ నేతలు ముద్దు రాధాకృష్ణ. వేదాద్రి, జ్ఞానరాజ్‌పాల్, జిల్లాలోని నియోజకవర్గాల బాధ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

రొంపిచర్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 350 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 25 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించామని నేత్ర వైద్యుడు కె.మురళీకృష్ణ తెలిపారు.

ఘనంగా స్వాగత దినోత్సవం

నరసరావుపేట అర్బన్ : ఎస్ఎస్ఎన్ కళాశాలలో బుధవారం స్వాగత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

యాంత్రీకరణ పరికరాలు ఇవ్వరూ

శావల్యాపురం : ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి రైతులకు యంత్ర పరికరాలు రాయితీపై ఇవ్వక ఇబ్బందులు పడ్డామని ఇప్పుడైనా ఇవ్వాలని పోట్లూరు, ఇర్లపాడు రైతులు వ్యవసాయాధికారులకు సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులకు అధికారులు సూచనలు చేశారు.

ముగిసిన చెకుముకి పోటీలు

శావల్యాపురం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీలకు మండలంలోని ఐదు జడ్పీ పాఠశాలల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు బోయపాటి త్రివిక్రమ్, ఆరేటి వసంతరావు తెలిపారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు.

రుణమాఫీ వెంటనే అమలు చేయాలి

వినుకొండ రూరల్ : ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయాన్ని అందించలేదని.. ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు హనుమంతరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం కార్యదర్శి ముని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తిమ్మాయిపాలెం సచివాలయం వద్ద నిరసన చేపట్టారు. నేతలు బొంకూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, బండి కోటయ్య, వెంకటప్పయ్య పాల్గొన్నారు.

మండల పరిషత్తు విస్తరణాధికారిగా నాగానంద్

నరసరావుపేట సెంట్రల్ : నరసరావుపేట మండల పరిషత్ విస్తరణ అధికారిగా నాగానంద్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన తుళ్లూరు నుంచి బదిలీపై నరసరావుపేటకు వస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు

యడ్లపాడు, న్యూస్‌టుడే : బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి అన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఇటీవల తిమ్మాపురం- నాదెండ్ల మార్గంలో వెళ్లే క్రమంలో చెరువు పక్కన వ్యర్థాలు గమనించారు. ఆయన ఆదేశాల మేరకు డీపీవో బుధవారం తిమ్మాపురం వచ్చి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వాటిని తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం యడ్లపాడు సచివాలయాన్ని సందర్శించారు. ఎంపీడీవో హేమలత, ఈవోపీఆర్డీ వరూధిని, పంచాయతీ కార్యదర్శి శశికళ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో బహుళ ప్రయోజనాలు

రొంపిచర్ల : తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు చిరుధాన్యాలతో లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశిదేవి అన్నారు. రొంపిచర్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీలు చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.

సత్తెనపల్లి

•సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ అధికారి రామాంజనేయులు

ఆశ్రమ పాఠశాల సందర్శన

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని శిరిగిరిపాడు ఆశ్రమ పాఠశాలను బుధవారం శ్రీశైలం ఐటీడీఏ అడిషనల్ అకాడమిక్ ప్రాజెక్టు ఆఫీసర్ రామాంజనేయులు సందర్శించారు. పాఠశాలలో బోధన విధానం గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిజిటల్ తరగతి గదులు, వసతి, వంటశాలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, వార్డెన్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

రెంటచింతల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ. 2,17,000 చెక్కును ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి బుధవారం అందజేశారు. రెంటచింతల మండలం మంచికల్లుకు చెందిన వెంకటనరసమ్మ అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. ఆమెకు ఈ మొత్తాన్ని అందించారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

వైద్యసేవల్లో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



ఫార్మసిస్టులను సత్కరిస్తున్న వైద్య ఆరోగ్య విస్తరణాధికారి, సిబ్బంది

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: రోగులకు చికిత్స అందించడంలో ఫార్మసిస్టుల పాత్ర ప్రముఖమైందని పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి శ్యాంసన్ తెలిపారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం నిర్వహించారు. ఫార్మసిస్టులకు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

మాచర్ల (విజయపురిసౌత్): ఫార్మసిస్టుల సేవలు ఎనలేనివని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి ఉదయభాను తెలిపారు. మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఫార్మసిస్టు అరుణబాయిని సత్కరించారు.

సెలవులో సర్పంచి

కారంపూడి: మేజరు పంచాయతీ కారంపూడి సర్పంచి ప్రమీలాబాయి వ్యక్తిగత కారణాలతో బుధవారం నుంచి సెలవు పెట్టారు. ఈమేరకు ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి సెలవు పత్రాన్ని అందించారు. ఇప్పటికే ఉపసర్పంచి అంకారావు అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. సర్పంచి పదవి ఎస్టీలకు రిజర్వు కావడంతో తెదేపా సానుభూతిపరురాలు, 15వ వార్డు సభ్యురాలు బాణావత్ సరస్వతిబాయి సర్పంచి అయ్యే అవకాశాలున్నాయి.

ఆర్టీసీ డీఎంకు వీడ్కోలు

మాచర్ల (కారంపూడి): బదిలీపై వెళుతున్న ఆర్టీసీ డీఎం పిచ్చయ్యను బుధవారం లైన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు సభ్యులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ నరసింహారావు, మాజీ ఛైర్మన్ ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, కోటిరెడ్డి, మార్కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది!

సత్తెనపల్లి, న్యూస్‌టుడే



పత్తి సాగు లాభసాటిగా ఉండేలా రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలు

మూసపద్ధతుల్లో పంటల సాగుకు స్వస్తి పలికి నూతన విధానాలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న 14 శాఖల సేవల్ని సద్వినియోగం చేసుకునేలా అందరి భాగస్వామ్యంతో ముందడుగు వేస్తున్నారు. పెట్టుబడి తగ్గించి పంటల దిగుబడి, ఆదాయం పెంచడమే ధ్యేయంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు పొలం బాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాలు మొదలయ్యాయి.

ప్రధాన పంటల సాగు (విస్తీర్ణం హెక్టార్లలో)

వరి	పత్తి	మిరప
29,854	61,950	36,337

రైతులకు అవగాహన

వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది సాగు ఆశాజనకంగా ఉంది. సాధారణ విస్తీర్ణానికి మించి ప్రధాన పంటలు సాగులోకి రానున్నాయనే అంచనాలు అధికారుల్లో ఉన్నాయి. ఇప్పటికే సాగులోని పంటలు ఇటీవల కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల దెబ్బతిన్నాయి. సమృద్ధిగా నీరుండటంతో చాలాచోట్ల పంటలు బాగున్నాయి. వ్యవసాయ అనుబంధ శాఖలైన మత్స్య, పట్టు, ఉద్యాన, సేంద్రియ, మార్కెటింగ్ అధికారులు పొలంబాట పట్టాలని ప్రభుత్వం నిర్దేశించింది. వీరంతా రైతుల్ని కలసి సాగు కష్టాలు తెలుసుకోవడమే కాకుండా దిగుబడి పరిస్థితులు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన పెంపొందించనున్నారు

వారంలో రెండ్రోజులు

ప్రతి మంగళ, బుధ వారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించేలా మార్గదర్శకాలు వెలువడ్డాయి. రోజుకు రెండు గ్రామాల్లో శాస్త్రవేత్తలు, అధికారులు పొలంబాట పట్టనున్నారు. నేరుగా పొలాల్ని సందర్శించి అక్కడే రైతులతో మాట్లాడనున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయి.

జిల్లాలో సాధారణ సాగు
2,48,350
హెక్టార్లు

ఇప్పటికే సాగులోకి వచ్చిన
1,58,906
హెక్టార్లు

లోపాలు గుర్తించి.. లాభాలబాట పట్టించి..

సాగులో పంటల్ని పరిశీలించి చీడపీడల్ని సకాలంలో గుర్తించనున్నారు. పంట దిగుబడులు తగ్గడానికి కారణాలు విశ్లేషించి వెంటనే చర్యలు తీసుకోనున్నారు. సూక్ష్మ పోషకాల లోపాల్ని గుర్తించి భూసారం పెంచేలా సూచనలు ఇవ్వనున్నారు. తుంపర, బిందు సేద్యం విధానంలో పంటల సాగును ప్రోత్సహించనున్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, రైతు మిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా పంట పెట్టుబడులకు రుణాల మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడంలాంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

అన్నదాతలకు ఉపయుక్తం

జిల్లాలో రైతులకు ఉపయుక్తంగా ఉండేలా పొలం పిలుస్తోంది కార్యక్రమాల్ని అమలు చేయబోతున్నాం. పెట్టుబడులు తగ్గించి దిగుబడులు, ఆదాయం పెంచేందుకు తోడ్పాటు అందిస్తాం. ఆధునిక సేద్యాన్ని అన్నదాతలకు చేరువ చేస్తాం. వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పొలంబాట పట్టడంతో సాగులో మెరుపులు రాబోయే రోజుల్లో చూడబోతున్నాం.

- మురళి, జిల్లా వ్యవసాయాధికారి

పాములు, కోతుల బెడదపై అటవీ అధికారులకు లేఖ

రాజుపాలెం: రాజుపాలెం కస్తూర్బా విద్యాలయంలో కోతులు, పాముల బెడద నుంచి కాపాడాలని బాలికలు సోమవారం పాఠశాల సందర్శనకు వచ్చిన ఆర్డీవో మురళీకృష్ణ వద్ద వాపోయిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దారు దుర్గేశ్వరరావు బుధవారం అటవీ అధికారులకు లేఖ ద్వారా సమాచారం అందించినట్లు చెప్పారు..

28న క్రోసూరులో జాబ్ మేళా

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 28న నిరుద్యోగ యువతి, యువకులకు ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సంజీవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చొరవతో ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాకు పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ పూర్తి చేసి, 18-35 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు అర్హులన్నారు. వివరాలకు 9494986164, 8074393466 చరవాణి నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి నివాళి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలో రాగసుధ కళాపరిషత్ ఆధ్వర్యంలో సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కళాకారులు ఎస్పీ బాలు చిత్రపటంతో జానపాడురోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. కళాపరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాష్ట్ర పునర్నిర్మాణానికి చంద్రబాబు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: రాక్షస, అరాచక వైకాపా పాలన అంతమై రాష్ట్రంలో ప్రజా సంక్షేమ కూటమి పాలన అందరికి చేరువైందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కుందురువారిపాలెంలో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వైకాపా నాయకులు ఐదేళ్లపాటు గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించి అప్పుల ఊబిలోకి జగన్‌మోహన్‌రెడ్డి నెట్టేశారన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, కోడెల విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

సర్పంచిని పార్టీలోకి చేర్చుకోవద్దు

సార్వత్రిక ఎన్నికల సమయంలో తెదేపా, జనసేన నాయకుల్ని ఎన్నో ఇబ్బందులకు గురి చేసిన గోళ్లపాడు సర్పంచి అప్పమ్మను పార్టీలోకి చేర్చుకోవద్దు.. ఆమె చెప్పిన పనులు చేయవద్దంటూ మండలంలోని గోళ్లపాడు గ్రామానికి చెందిన తెదేపా నాయకులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు.

అంతర సాగుతో అధిక దిగుబడి



పత్తి పంట పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

పెదపాలెం(అచ్చంపేట): పత్తిలో అంతర సాగుతోపాటు, యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించాలని జాతీయ పత్తి పరిశోధనా సంస్థ రాష్ట్ర నోడల్ అధికారిణి డాక్టర్ యానీషీబా పేర్కొన్నారు. బుధవారం ఆమె పెదపాలెంలో కృషివిజ్ఞాన కేంద్రం దర్శి ఆధ్వర్యంలో పత్తి ప్రదర్శన క్షేత్రాల సందర్శనతోపాటు రైతుల అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి, ఏడీఏ హనుమంతరావు పత్తిలో వేరుకుళ్లు, పచ్చదోమ, తెల్లదోమ, తెగుళ్ల లక్షణాలను గుర్తించడం గురించి వివరించారు. వాటి నివారణ చర్యలు తెలిపారు.

తెదేపా కార్యకర్తపై వైకాపా శ్రేణుల దాడి

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: పంట కాల్వ విషయమై తెదేపా కార్యకర్తపై వైకాపా శ్రేణులు దాడి చేసిన ఘటన మండలంలోని లంకెలకూరపాడులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తెదేపా నాయకుడు సుబ్బారెడ్డి వ్యవసాయ పొలానికి సంబంధించిన పంట కాల్వ విషయమై వైకాపా నాయకులు తెదేపా మద్దతుదారులతో గొడవపడ్డారు. ఈ క్రమంలో తెదేపా కార్యకర్త లింగారెడ్డిపై దాడి చేశారు. సమాచారం అందుకున్న సత్తెనపల్లి గ్రామీణ సీఐ రాంబాబు, ఎస్సై సోమేశ్వరరావు లంకెలకూరపాడుకు చేరుకుని దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకున్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు రాయితీపై అందిస్తాం

పిడుగురాళ్ల: బిందు సేద్యం, తుంపర సేద్యంపై ఉత్సాహం ఉన్న రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు రాయితీపై అందజేస్తామని, రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఉద్యాన అధికారి మోహన్ చెప్పారు. బుధవారం కరాలపాడు, చెన్నాయిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ కృష్ణదేవరాయలు, ఏవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా క్రీడా పోటీలు

క్రోసూరు(అచ్చంపేట): స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం నియోజకవర్గ స్థాయి ఖోఖో, అథ్లెటిక్స్ బాలబాలికల పోటీలు కోలాహలంగా జరిగాయి. పోటీలను ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు ప్రారంభించారు. గెలిచిన విద్యార్థులు ఈనెల 27న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

గత పాలకుల తీరుతోనే జెర్రివాగు పథకం నిర్వీర్యం



డ్వాక్రా మహిళలకు చెక్కు అందిసున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: గత పాలకుల తీరుతోనే జెర్రివాగు సాగునీటి పథకం మూలనపడిందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం శిరిగిరిపాడులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే డిసెంబరు నాటికి వరికపూడిశెల ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభిస్తామన్నారు. 'నా పదవీకాలం పూర్తయ్యేలోపు పథకాన్ని పూర్తి చేయలేకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని' అన్నారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లిలాగా మాట తప్పి పారిపోనన్నారు. ఇదే వేదికపై గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల నృత్యం ఆకట్టుకుంది. వారికి ఎమ్మెల్యే రూ. 5 వేలు బహుమతిగా ఇచ్చారు. అనంతరం స్థానిక జడ్పీ పాఠశాలలో బోరును ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామంలో రూ. 30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. 439 మంది డ్వాక్రా మహిళలకు రూ. 3,62,00,000 చెక్కు నమూనాను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజిరెడ్డి, రాష్ట్రతెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, మండల ప్రత్యేకాధికారి జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: పంటల సాగుకు పరికరాలు, లింగాకర్షక బుట్టలు అవసరమైతే రైతులు తమకు తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి కోరారు. మండలంలోని గోళ్లపాడు రైతుసేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త వెంకటరాములు వరి, పత్తి, మొక్కజొన్న పంటల సాగులో తీసుకోవాల్సిన సమగ్ర, పోషక, సస్యరక్షణ యాజమాన్యాన్ని వివరించారు.

గురజాల గ్రామీణ: గొట్టెముక్కల, దైద, తేలుకుట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో సంధ్యారాణి పత్తి, మిరప పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.

సత్తెనపల్లి గ్రామీణ: విచ్చలవిడిగా ఎరువుల వాడకం పంటకు, భూమికి చేటు చేస్తుందని, భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగిస్తే అన్నివిధాలా ప్రయోజనమని జిల్లా వ్యవసాయ అధికారి మురళి తెలిపారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి ప్రాంతంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తి, వరి పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. లాంఫాం శాస్త్రవేత్త వెంకటరాములు, ఇన్‌ఛార్జి ఏడీఏ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరావతి: ప్రతి రైతు సాగుచేసిన పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని, అప్పుడే ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు అందుతాయని ఏఓ అహ్మద్ సూచించారు. బుధవారం దిడుగు, మల్లాది గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

'నూర్‌బాషాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం'

మాచర్ల (కారంపూడి): రాష్ట్రంలోని నూరుబాషాల సంక్షేమానికి తెదేపా కట్టుబడి ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం నూర్‌బాషాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన ముఖ్యమంతి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారన్నారు.

గేదెలు పట్టుకుపోయారని ఫిర్యాదు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి గోరంట్లలో మూడు గేదెలు గుర్తుతెలియని వ్యక్తులు పట్టుకుపోయారని మద్దిగుంట్ల నరసింహారావు అనే పశుపోషకుడు బుధవారం గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి ఎదుట కట్టివేసిన గేదెలను మంగళవారం రాత్రి తోలుకు పోయారని వివరించాడు. వాటి విలువ సుమారు రూ. 1.5 లక్షలు ఉంటుందని వాపోయాడు.

తూతూమంత్రంగా మండల సమావేశం

పెదకూరపాడు, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మీరయ్య అధ్యక్షతన బుధవారం జరిగింది. అయితే ప్రజాప్రతినిధులు సమావేశంపై ఆసక్తి చూపలేదు. కొన్ని శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సీజనల్ వ్యాధుల పట్ల గ్రామీణులను అప్రమత్తం చేయాలని ఎంపీపీ తెలిపారు. గతంలో జరిగిన పనులపై సమీక్ష నిర్వహించి సమావేశాన్ని ముగించారు. ఉప ఎంపీపీ చాంద్‌బాష, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దారు దానియేలు పాల్గొన్నారు.

సిబ్బంది కొరత.. పట్టణవాసులకు వెత

మాచర్ల పురపాలికలో 53 పోస్టులు ఖాళీ



మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మాచర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో సిబ్బంది కొరతతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 112 మంది సిబ్బంది అవసరం కాగా.. 59 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. వివిధ శాఖలకు చెందిన 53 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు సాగడం లేదు. అభివృద్ధిలో ప్రధానమైన బిల్ కలెక్టర్లు నలుగురికి గాను ఒక్కరూ లేరు. ఈ బాధ్యతను ఇతర సిబ్బందికి అప్పగించడంతో నిధుల సేకరణ సక్రమంగా సాగడం లేదు. 47 పబ్లిక్ హెల్త్ వర్కర్లుకు గాను 31 మంది మాత్రమే ఉన్నారు. ఫలితంగా పట్టణంలో పారిశుద్ధ్యం పడకేస్తోంది. టౌన్ ప్లానింగ్ అధికారులు ఒక్కరూ అందుబాటులో లేరు. దీంతో మున్సిపాలిటీ ఆదాయం తగ్గగా కొత్తగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారు అనుమతుల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. దీనిపై ఛైర్మన్ పోలూరి నరసింహారావు మాట్లాడుతూ సిబ్బంది కొరత వాస్తవమేనన్నారు. ప్రస్తుతం బదిలీలు జరుగుతున్న క్రమంలో ఖాళీ పోస్టులు భర్తీ అవుతాయని ఆశిస్తున్నాం. ఎమ్మెల్యేతో మాట్లాడి ఖాళీలను భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.